క్లుప్తంగా

బొజ్జన్నకొండను సందర్శించిన బౌద్ధమత ప్రచారకులు



బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మానంద తదితరులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతానికి చెందిన బౌద్ధమత ప్రచారకులు అనకాపల్లి మండలం బొజ్జన్నకొండను శుక్రవారం సందర్శించారు. అక్కడ బౌద్ధ స్తూపం వద్ద ప్రార్థనలు చేసి, అంతా ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బౌద్ధ మత ప్రచారకులు ధర్మానంద మాట్లాడుతూ ఇలాంటి క్షేత్రాలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బౌద్ధ మత ప్రచారకులు పాల్గొన్నారు.

పాలిథిన్ సంచులు స్వాధీనం



పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ అధికారులు

గోపాలపట్నం: జీవీఎంసీ అధికారులు శుక్రవారం గోపాలపట్నం బంక్ సమీపంలో పలు దుకాణాల్లో ప్రత్యేక తనిఖీలు జరిపి, పాలిథిన్ సంచులను స్వాధీనం చేస్తున్నారు. ఈ దాడులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాము, సచివాలయం కార్యదర్శులు బండారు శ్రీనివాసరావు, మణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, పర్యావరణానికి హానికలిగించే పాలిథిన్ సంచులను వినియోగించరాదని, విక్రయించరాదని సూచించారు. వస్త్ర, నార సంచులు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు మాధవి, అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్లు దమ్ము శ్రీనివాసరావు, బి.వి. రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం పరిధి దుర్గానగర్‌లో దుర్గామాంబ అమ్మవారి ఆలయంలో మాఘ మాస శుద్ధ చవితి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఈ పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు



నేవీ అధికారులతో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

సింథియా: శీతాకాల అధ్యయన యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీలోని లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నుంచి సుమారు 38 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రెండు బృందాలుగా తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. నావికాదళ కార్యకలాపాలు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు.

తాజా కూరలు.. సమకూరిన సౌకర్యాలు



విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది





విద్యుత్ కాంతుల్లో గోపాలపట్నం రైతుబజారు

గోపాలపట్నం: తెల్లవారుజామునే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని ఆఫీసులకు పరుగులు తీసే ఉద్యోగులకు, కూలి పనుల కోసం దూరాభారం వెళ్లి, తిరిగి రాత్రి ఇంటికి చేరుకునే కూలీలకు రైతు బజార్ల టైమింగ్స్ అందుబాటులో ఉండడం లేదు. దీంతో వారు బయటషాపుల్లో అధిక ధరలు చెల్లించి కూరగాయలు కొనుగోలు చేయవలసి వస్తోంది. అలాంటి వారి కోసం, ఉదయం పూట కొనుగోలుకు సమయం దొరకని వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాత్రి రైతు బజారుకు ఆదరణ పెరుగుతోంది. నాణ్యమైన కాయగూరలు అందించేందుకు అధికారులు కొన్నేళ్లక్రితం గోపాలపట్నంలో నైట్ రైతు బజారును ప్రారంభించారు. మొదట్లో విద్యుత్ దీపాలు లేక పోవడం వల్ల అటు రైతులు ఇటు కొనుగోలుదారులు ఇబ్బందులు పడేవారు. తరువాత సమస్యలను పరిష్కరించడంతో ఇక్కడకు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య పెరిగింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సుమారు 45 షాపుల్లో ఇక్కడ కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రతి రోజు రూ.1.50 లక్షల వరకూ వ్యాపారం జరుగుతోంది.

వీడుతున్న అపోహ... : రాత్రి రైతుబజారులో తాజా కూరగాయలు దొరకవనే అపోహ ఉండేంది. అయితే రాత్రి పూట కూడా నాణ్యమైన, తాజా కూరగాయలు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం విక్రయించే రైతులతో కాకుండా రాత్రి వేళ వేరే రైతులకు అవకాశం కల్పించి, తాజా కూరగాయలు తీసుకువచ్చేలా ఏర్పాటు చేశారు.

విద్యుత్ దీపాల ఏర్పాటు : రైతు బజారులో ప్రత్యేకంగా కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాత్రి వేళ రైతుబజారు లోపల సర్కిల్ వద్ద, బయట కొన్ని స్టాళ్లలో కూరగాయలు విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల సంఖ్య పెరిగితే స్టాళ్ల సంఖ్యను కూడా పెంచుతామని అధికారులు చెబుతున్నారు.



రాత్రి సమయంలో కాయగూరలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

వ్యాపారం బాగుంది



రాత్రి పూట రైతు బజారులో వ్యాపారం బాగా జరుగుతోంది. ఇపుడిప్పుడే కొనుగోలుదారులు అలవాటుపడుతున్నారు. అన్నిరకాల వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. తాజా కూరగాయలను అందుబాటులో ఉంచుతున్నాం.

–ధనలక్ష్మి, రైతు, చింతల అగ్రహారం

ఉద్యోగులకు అనువుగా ఉంది



నేను, నా భార్య ఉద్యోగులం. ఉదయం వేళ హడావుడిగా విధులకు వెళ్లవలసి వస్తోంది. దీంతో రైతు బజారుకు వెళ్లడం వీలుపడడం లేదు. సాయంత్రం సమయంలో తీరుబాటుగా కూరగాయలు కొనుగోలు చేసుకుంటాం. ఉదయం ఉండేవిధంగా రాత్రి పూట కూడా రైతు బజారులో తాజా కూరగాయలు లభిస్తున్నాయి. దీన్ని మరింతగా అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– బి.కిరణ్ కుమార్. నాయుడు తోట

సౌకర్యాల కల్పనకు కృషి



కొనుగోలుదారుల కోసం సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు సైతం సహకారం అందిస్తున్నారు. ప్రధానంగా విద్యుత్ దీపాల ఏర్పాటు చివరి దశకు చేరుకుంది. వీటితో పాటు మరికొన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కొనుగోలుదారుల సంఖ్య పెరిగితే మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– ప్రసాద్, ఈవో, గోపాలపట్నం రైతుబజారు

ప్లాస్టిక్‌తో పలు అనర్థాలు



ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మల్కాపురం: ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, వస్త్ర లేదా పేపర్ బ్యాగుల వినియోగం పర్యావరణ పరిరక్షణకు ఎంతో మేలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్ అన్నారు.58వ వార్డు పరిధి శ్రీహరిపురంలో సచివాలయ సిబ్బందితో పాటు ఆయన శుక్రవారం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలిథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా వస్త్ర, కాగితపు బ్యాగులను వినియోగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మల్కాపురం: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని మల్కాపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు... జీవీఎంసీ 61వ వార్డు పరిధి జనతాకాలనీలో ఉంటున్న అమర్‌నాథ్(21) మత్తుకు బానిసై పలు దొంగతనాలు, గొడవలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో అమర్‌నాథ్‌పై రౌడీషీటర్ తెరిచారు. గతంలో కొత్తగాజువాక బీసీ రోడ్డులో నివాసముండే అమర్‌నాథ్ ఇటీవల జనతాకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అమర్‌నాథ్ గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు మల్కాపురం సీఐ విద్యాసాగర్ తనిఖీ చేయగా అతని వద్ద 1.5 కిలోల గంజాయి లభించింది. దీంతో అతనిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

పల్లె నుంచి నగరానికి..



సింహాచలం రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం దుర్గ రైలు దిగిన ప్రయాణికుల



ప్రయాణికులతో కిటకిటలాడిన రైల్వే బ్రిడ్జి

గోపాలపట్నం: సంక్రాంతి సందర్భంగా స్వగ్రామాలకు వెళ్లిన వారు తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. దీంతో సింహాచలం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. ఆదివారం వరకు రద్దీ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా మర్రిపాలెం, గోపాలపట్నం, గాజువాక, షీలానగర్ ప్రాంత వాసులు సింహాచలం రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు రాసాగించేందుకు మొగ్గు చూపుతారు. ఇక్కడి నుంచి వెళ్లేందుకు బస్సులు, ఆటోలు ఎక్కువగా అందుబాటులో ఉండడంతో ప్రయాణికులు ఈ స్టేషన్‌ను ఎంచుకుంటారు. సింహాచలం రైల్వే స్టేషన్‌లో సాధారణ రద్దీతోపాటు తిరుగు ప్రయాణికుల రద్దీకూడా ఎక్కువగా ఉంది.

రహదారి భద్రతపై అవగాహన

మద్దిలపాలెం: జాతీయ రహరి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం మద్దిలపాలెం జంక్షన్ వద్ద అవగాహన ప్రదర్శన నిర్వహించారు. డీటీసీ ఆదినారాయణ సామాజిక కార్యకర్తలతో పాటు,ట్రాఫిక్ పోలీసులు,రవాణా తనిఖీ అధికారులు ఐ.వేణుగోపాల్,బుచిరాజు ,బాలాజీ తదితరులతో కలిసి ప్ల కార్డులు బ్యానర్ల ప్రదర్శించి రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు. డీటీసీ ఆదినారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. పాదచారులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి అని, సిగ్నల్స్‌ను పాటించాలని కోరారు. అప్పుడే ప్రమాదాలను కట్టడి చేయవచ్చునన్నారు.

రహదారులు దుర్గంధ భరితం



తోటవీధిలో పేరుకుపోయిన చెత్త



గోకుల్‌నగర్ రహదారిలో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలో గల రహదారులు చెత్తచెదారాలతో దుర్గంధభరితంగా మారాయి. సంక్రాంతి సెలవులు ముగిసినా పారిశుద్ధ్య సిబ్బంది జాడ కనిపించడం లేదు. గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారి నుంచి తోటవీధి, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్‌కు వెళ్లే రహదారులు చెత్తచెదారాలతో నిండిపోయాయి. అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ముక్కుమూసుకోవలసి వస్తోంది. ఇలాయితే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆయా కాలనీల ప్రజలు తెలిపారు. సంబంధిత జోన్–5 పబ్లిక్‌హెల్త్ అధికారులు స్పందించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని వారు కోరారు.

నేడు ‘స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్–స్వచ్ఛ విశాఖ’

విశాఖ సిటీ: స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రతి నెల 3వ శనివారం ‘స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్–స్వచ్ఛ విశాఖ’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం(18వ తేదీ) ఉదయం 10 గంటలకు సెంట్రల్ పార్క్ వద్ద, అనంతరం 11.30 గంటలకు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి సామాజిక బాధ్యతగా తన పరిసరాలతో పాటు కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనవసరమైన కాగితాలను తొలగించాలని తెలిపారు. సంస్థ నిర్వహణలో ఉన్న అన్ని పార్కులలో చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, అదేవిధంగా వీఎంఆర్‌డీఏ పరిధిలోని వాణిజ్య సముదాయాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని శతశాతం నిషేధించాలని ఆదేశించారు. తప్పని సరిగా వస్త్ర లేదా కాగితపు సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు. విధిగా పొడి చెత్త, తడి చెత్తలకే వేర్వేరుగా చెత్త బుట్టలను వినియోగించాలని సూచించారు.

విండ్‌బాల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్ వేస్తున్న కోమటి శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి నిర్వాసితకాలనీ అప్పికొండ సీతారాముల పరస మహోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు గ్రామ పెద్దలతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నాయకులు ఎన్నేటి రమణ, లక్కరాజు రామారావు మాట్లాడుతూ క్రీడల వల్ల నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయని, జీవితంలో ఎదరయ్యే సమస్యలను సులభంగా పరిష్కరించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వర్రె రాజు, సారిపల్లి రాంబాబు, వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కోనేటి పారిపల్లి, సారిపల్లి గణపతి, సత్యవతి, సోమేష్, అర్జున్, రంగారావు, ప్రశాంతి, నిర్వాహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన
ఆర్మీ వార్ కాలేజ్ ఆఫీసర్లు



నేవీ అధికారులతో ఆర్మీ వార్ కాలేజీ ఆఫీసర్లు

సింథియా: నేవల్ అండ్ ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా కమాండర్, హయ్యర్ కమాండ్ వింగ్, ముగ్గురు డైరెక్టింగ్ హయ్యర్ స్టాఫ్, మోవ్ ఆర్మీ వార్ కాలేజీకి చెందిన సుమారు 50 మంది ట్రైనీ అధికారులు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. నౌకాదళంలో నిర్వహిస్తున్న వివిధ కార్యకలాపాలను తెలుసుకోవడంతో పాటు అంకితభావంతో పనిచేస్తున్న నేవీ సిబ్బంది పాత్రలను తెలుసుకోవడం, ఆర్మీ వార్ అధికారులు నౌకాదళానికి తమను తాము పరిచయం చేసుకోవడమే ఈ సందర్శన యొక్క ముఖ్య లక్ష్యమని నేవీ వర్గాలు తెలిపాయి. భారత నౌకాదళం ఆదేశాల మేరకు ఎస్కేప్ ట్రెనింగ్ స్కూల్, ఐఎన్ఎస్ శాతవాహన, నేవల్ డాక్‌యార్డ్, ఫ్రంట్‌లైన్ వార్‌షిప్‌లు, సబ్‌మెరైన్‌లు, నావల్ ఎయిర్‌స్టేషన్, ఐఎన్ఎస్ డేగాను కూడా ఆర్మీ అధికారులు సందర్శించారు.

యూనియన్ల ముసుగులో డబ్బుల వసూలు



సమావేశంలో మాట్లాడుతున్న దేవర అప్పలరాజుయాదవ్

మల్కాపురం: యూనియన్ల ముసుగులో కొంత మంది నాయకులు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని విశాఖ ఇండ్రస్టియల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు దేవర అప్పలరాజుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. 59వ వార్డు నక్కవానిపాలెంలో యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో పలువురు కాంట్రాక్టర్ల వద్ద చేస్తున్న కార్మికుల నుంచి వారిని ఆ పనుల్లో పెట్టిన యూనియన్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఒక్కో కార్మికుడి నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసి,అలాంటి యూనియన్ నాయకుల బండారం బటపెడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

దోపిడీ దొంగల అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న యువకుడిని ఇద్దరు వ్యక్తులు అడ్డగించి సెల్ ఫోను, నగదు దోచుకున్నారు. బాధితుడు గాజువాక క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి ఇద్దరు దొంగలను అదుపులోకి తీసుకున్నారు. గాజువాక సౌత్ క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు. బాధితుడు అక్కిరెడ్డిపాలేనికి చెందిన యల్లపు సారధి(27) షీలానగర్‌లో రామేశ్వరం ఫుడ్స్ హోటల్ నిర్వహిస్తుంటాడు. ఈ నెల 15వ తేదీన తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో కోరమండల్ హనుమాన్‌నగర్‌లో ఉంటున్న తన మేనత్త లక్ష్మి ఇంటి నుంచి ములగాడ మీదుగా అక్కిరెడ్డిపాలెం వస్తున్నాడు. సరిగ్గా ములగాడ ఏరియా పెంటమాంబ గుడి వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి యువకుడిని అడ్డగించారు. అందులో ఒక వ్యక్తి సారధిని కదలకుండా పట్టుకొని జేబులో ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.300 నగదు లాక్కోవడంతో గట్టిగా కేకలు వేయగా జింక్ శివాలయం కొండపైకి తీసుకువెళ్లి దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఏసీపీ–జోన్ 2 డి.లక్ష్మణరావు ఆదేశాల ప్రకారం సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసుల బృందం శుక్రవారం జింక్ గేటు వద్ద శ్రీహరిపురం, పాతరామాలయం గుడి దగ్గరగల కుంచమ్మ కాలనీకు చెందిన మనోజ్ కుమార్, కామడ బాలకృష్ణ అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి సెల్ ఫోనుతోపాటు రూ.300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెడు అలవాట్లకు బానిసలై ఈజీ మనీ కోసం దోపిడీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న మళ్ల విజయప్రసాద్ దంపతులు

మల్కాపురం: రిపబ్లిక్ డే సందర్భంగా 60వ వార్డు కార్పొరేటర్, పి.వి.ఎస్.హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి డాక్టర్ పి.వి.సురేష్ ఆధ్వర్యంలో ఈ నెల 26న 60వ వార్డు గుల్లలపాలెం,వాకింగ్ పార్కు సమీపంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త,మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ కోరారు. రక్తదానం శిబిరానికి సంబంధించిన పోస్టర్,కరపత్రాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మళ్ల ప్రసాద్ మాట్లాడుతూ తన ట్రస్టు ద్వారా నగర నలుమూలలకు చెందిన పలువురు నిరుపేదలకు సేవా కార్యక్రమాలను అందించి సురేష్ ఆదర్శంగా నిలిచారన్నారు.రికార్డు స్థాయిలో సురేష్ ప్రతి ఏటా బ్లడ్ క్యాంప్‌లను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 26న నిర్వహించే రక్తదానం కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి.వి.సురేష్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్, డి.కె.ఫౌండేషన్ చైర్మన్ దొడ్డి కిరణ్, 92వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామినాయుడు, మళ్ల శివ,ఎస్సీ,ఎస్టీ సెల్ మానటరింగ్ కమిటీ మెంబర్ పూండి మల్లేశ్వరరావు,దొడ్డి సతీష్,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల చరిత్ర ఆదర్శనీయం



రాయల చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

విశాఖ విద్య: శ్రీకృష్ణదేవరాయల పాలన నేటి పాలకులకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయని ఈస్టర్న్ నేవల్ కమాండ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి కొనియాడారు. కాకానినగర్‌లోని అసోసియేషన్ భవనంలో శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయల జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, కళలు, ఇలా ప్రతి ఒక్క రంగాన్ని రాయలు తనదైన శైలిలో శాశ్వతంగా నిలిపారన్నారు. అంతేకాకుండా సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామి, తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు అనేక దేవాలయాలకు తన తల్లిదండ్రులు, భార్య, కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం ఎన్నో వజ్రాలు, పచ్చల పతకాలు అందజేశారన్నారు. రాయల పరిపాలన నేటికీ చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విజనగిరి భాస్కరరావు, కార్య వర్గ సభ్యులు బీఎస్ నాయుడు, ఎస్. రమణ,సూర్య ప్రకాష్, కె. భాస్కర్ ప్రసాద్,జగదీశ్, గూడం కిరణ్ కుమార్ ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనంతోనే స్టీల్‌ప్లాంట్‌కు భవిత



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న రాంబాబు,మాజీ కార్పొరేటర్ ఈశ్వరమ్మ

సీతమ్మధార: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పూర్తిగా మనుగడ సాధించాలంటే సెయిల్‌లో విలీనం చేయాలని గాజువాక జోన్ సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు,మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష 1,389 రోజు కొనసాగింది.

ఈసందర్భంగా రాంబాబు, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ స్టీల్ ప్లాంట్ కొంత మేర ఆర్థిక సమస్యల నుంచి బయటపడడానికి తాత్కాలిక ఉపశమనంగా ఉంటుందన్నారు. ఈ ప్యాకేజీ శాశ్వతమైన పరిష్కారం కాదని వారు చెప్పారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే, సొంత గనులు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు సెయిల్‌లో విలీనం చేయడం ద్వారానే విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ బలమైన సంస్థగా ఎదుగుతుందని చెప్పారు. దీనిపైన కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదన్నారు. ఆర్థిక ప్యాకేజీ ఏ రూపంలో ఇస్తున్నారో స్పష్టం చేయలేదని తెలిపారు. పూర్తిస్థాయిలో ఉద్యోగులను నియమించాలని.. అవసరమైన వసతులు కల్పించి పూర్తిస్థాయిలో ఉత్పత్తి సాధించడానికి సహకరించాలని డిమాండ్ చేశారు. రిలేనిరాహార దీక్షలో గొలగాని అప్పారావు, ఎ. నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.